# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

E69 NEWS



విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

9959812941-9949356387



PUBLISHED: HYDERABAD, JANGAON | సంపుటి :01 | సంచిక :22 | మంగళవారం 23 జూన్ 2026 | ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ | పేజీలు: 04 | వెల :05/-


# తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన

## 6 రోజుల పాటు దంచికొట్టనున్న వానలు!




# 'ఏడు జన్మలెత్తినా ఏం చేయలేవు'

## డిప్యూటీ సీఎం పవన్‌పై మాజీమంత్రి అంబటి ఫైర్

**న్యూస్ డెస్క్, 22 జూన్ (తెలుగు గళం):** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తీరుపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీమంత్రి అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అమరావతిలో జరిగిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. సాయికృష్ణ కేసు నుంచి సుగాలీ ప్రీతి ఉదంతం వరకు ప్రతి విషయంలోనూ పవన్ ప్రజలను, బాధితులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఒకవైపు ప్రభుత్వం సాయికృష్ణ కుటుంబాన్ని పిలిపించి న్యాయం చేస్తామని చెబుతుంటే.. మరోవైపు పవన్ కళ్యాణ్ ఏమో సాయికృష్ణను ఒక క్రిమినల్ అని మాట్లాడుతున్నారని అన్నారు.దే సమయంలో జనసేన నేత సామినేని ఉదయభాను సాయికృష్ణ తల్లిని ఓదార్చేందుకు వెళ్లి.. పవన్ కళ్యాణ్ పంపిస్తేనే వచ్చామని చెబుతున్నారు. అసలు పవన్ ఏం చెప్పాలనుకుంటున్నారో ఆయనకే తెలియాలి అని అన్నారు. వైసిపి నేతలను తాటతీస్తామంటూ పవన్ చేస్తున్న వ్యాఖ్యలపై అంబటి మండిపడ్డారు.




# రైతులకు తీపికబురు

## ఒకే విడతలో 'రైతు భరోసా' పంపిణీ



- ఒకేసారి రైతు భరోసా
- జూన్ 30న నిధుల విడుదల
- రూ.9 వేల కోట్ల జమ
- 73 లక్షల రైతులకు లబ్ధి
- ఒకే విడతలో చెల్లింపులు
- సన్న రైతులకే ప్రాధాన్యం
- ఏడున్నర ఎకరాలకే పరిమితి?
- సాగు రైతులకే సాయం
- శాటిలైట్ సర్వేతో ఎంపిక
- పట్టాదారులకు కొత్త నిబంధనలు
- కౌలు రైతులపైనా దృష్టి
- ఖరీఫ్‌కే భరోసా?
- పంట ఆధారంగానే చెల్లింపు
- రైతులకు పెట్టుబడి ఊరట
- వ్యవసాయ శాఖ భారీ ప్రణాళిక

**న్యూస్ డెస్క్, 22 జూన్ (తెలుగు గళం):** ప్రభుత్వానికి ఆర్థిక భారమైనా రైతులకు భరోసా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈనెల 30న ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో జరగనున్న బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి నిధులు విడుదల చేయనున్నారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభంకావడంతో రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కొత్త పట్టా పాసు బుక్ వివరాలను సీసీఎల్ఏ నుంచి ప్రభుత్వం తెప్పించుకుంది. మొత్తం 73 లక్షల మంది రైతుల ఖాతాలో రూ.9 వేల కోట్లు జమ చేసేందుకు పక్కాగా ప్లాన్‌చేస్తోంది. యాసంగిలో రెండు ఎకరాలకే పెట్టుబడి సాయం అందించడంతో రైతుల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీంతో దాని నుంచి బయటపడేందుకు ఒకేసారి జమ చేస్తే బాగుంటుందని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారు. ఇక నిధుల కొరత ఏర్పడితే మొదట ఎకరం చొప్పున 9 రోజుల్లో పూర్తిగా పంపిణీ చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖలో టాక్ వినిపిస్తోంది.


మిగతాది 2 లో..


# ఇందిరమ్మ రాజ్యం వచ్చింది.. ఇంటింటా సంక్షోభం తెచ్చింది




**న్యూస్ డెస్క్, 22 జూన్ (తెలుగు గళం):** ఇందిరమ్మ రాజ్యం తెలంగాణలోకి వచ్చి ఇంటింటా సంక్షోభం నింపిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తీసుకున్న పంటల కొనుగోలు తాలూకు నిర్ణయం రాష్ట్ర రైతాంగానికి ఉరితాడుగా మారబోతుందని కేటీఆర్ అన్నారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్‌ది సుతిలేని సంసారం

## ఎంపీ రఘునందర్ రావు హాట్ సెటైర్లు




# ఘోర రోడ్డు ప్రమాదం

## డిటీఓ పైకి దూసుకెళ్లిన బొగ్గు టిప్పర్.!




**న్యూస్ డెస్క్, 22 జూన్ (తెలుగు గళం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సోమవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. పరకాల–భూపాలపల్లి జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా రవాణా శాఖ అధికారి (డిటీఓ) వెంకన్నను బొగ్గు టిప్పర్ లారీ ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు.

పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. జిల్లా రోడ్డు రవాణా శాఖ కార్యాలయం ఎదుట వెంకన్న తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు.

# టీ కాంగ్రెస్‌లో కీలక పరిణామం..

## పటాన్‌చెరు నుంచి బరిలో జగ్గారెడ్డి?

**న్యూస్ డెస్క్, 22 జూన్ (తెలుగు గళం):** తెలంగాణ రాజకీయాలు రోజు రోజుకు రంజుగా మారుతున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు మరో రెండున్నరేళ్లకు పైగా సమయం ఉన్నప్పటికీ పోటీ కోసం నేతలు ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలు పెట్టారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సీనియర్లు రాజకీయం సాగిస్తుంటే తమ వారసుల కోసం రూట్ క్లియర్ చేసే పనిలో మరికొంత మంది బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో తెలంగాణ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతున్న చర్చ ఆసక్తిని రేపుతోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సరికొత్త వ్యూహంతో బరిలోకి దిగేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.




**పటాన్‌చెరు నుంచి బరిలోకి?:**

తెలంగాణ కాంగ్రెస్‌లో ఫైర్ బ్రాండ్‌గా పేరున్న జగ్గారెడ్డి గత కొంత కాలంగా చేస్తున్న రాజకీయం సంగారెడ్డి జిల్లాలోనే కాకుండా తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చనీయాశంగా మారుతోంది. తన సొంత గడ్డ సంగారెడ్డి నియోజకవర్గాన్ని వదిలి ఈసారి పటాన్‌చెరు అసెంబ్లీ స్థానం నుండి పోటీ చేసేందుకు ఆయన ఆసక్తి చూపుతున్నట్లు టాక్ వినిపిస్తోంది.

# నీట్ రీ ఎగ్జామ్‌లో మళ్లీ దగా

## బీహార్‌లో 'సాల్వర్ గ్యాంగ్' గుట్టురట్టు..




**న్యూస్ డెస్క్, 22 జూన్ (తెలుగు గళం):** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ యూజీ వైద్య విద్యా ప్రవేశ పరీక్షల వివాదాలు సమిసిపోయి.. మళ్లీ పరీక్ష నిర్వహించింది ఎన్టీఏ. అయితే దురదృష్టవశాత్తు ఈ రీ ఎగ్జామ్‌లోనూ అక్రమార్కులు తమ పంథా మార్చుకోలేదు. బీహార్‌లోని లఖిసరాయ్ జిల్లాలో పరీక్షా కేంద్రాల వద్ద నిర్వహించిన పకడ్బందీ తనిఖీల్లో భారీ కుంభకోణం వెలుగుచూసింది.

# రైతులకు తీపికబురు..ఒకే విడతలో 'రైతు భరోసా' పంపిణీ

మొదటి పేజీ తరువాయి

ఏడున్నర ఎకరాలకే..

మరోవైపు యాసంగి సీజన్‌లో భరోసా తమే సాగు అవుతాయి. అయితే వరి తర్వాత పెద్ద మొత్తంలో సాగు చేసే పంట పత్తి. ఇది వానాకాలంలోనే వేయగా జనవరి వరకు పూర్తవుతుంది. రెండోసారి రబీలో సాగు చేయరు. అలాంటప్పుడు పత్తికి పెట్టుబడిసాయం ఎందుకని ప్రభుత్వ పెద్దలు సమాలోచనలు చేస్తున్నట్టు తెలిసింది. దీంతో రైతు భరోసా ఒక ఖరీప్‌సీజన్‌కే పంపిణీ చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖలో ప్రచారం జరుగుతోంది. ధనవంతులైన రైతులకు కూడా భరోసా ఇస్తే ప్రభుత్వానికి ప్రయోజనం లేదని, సన్న, చిన్న కారు రైతులకే వేయాలనే అంచనాకు వచ్చినట్టు సమాచారం. వచ్చే వానాకాలం 7.20 గుంటల వరకు పరిమితి పెట్టి ఆ లోపు భూమి కలిగిన వారికే భరోసా సాయం అందజేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది. రాష్ట్రంలో 1.50 కోట్ల ఎకరాల భూమి ఉంటే అందులో 20 నుంచి 25 లక్షల ఎకరాల భూమి రియల్ ఎస్టేట్, కాలువలు, కుంటలు, బీడు భూములు, సాగుకు పనికిరాని పడావు భూములున్నాయి. వీటిని భరోసా జాబితా నుంచి ప్రభుత్వం ఇప్పటికే తొలగించనుంది.

ఒకే పంటకు సాయం

రైతు భరోసా నిధులు సాగు చేసే రైతులకే పంపిణీ చేయాలని లక్ష్యంగా రేవంత్‌ప్రభుత్వం ప్లాన్‌చేస్తోంది. గత బీఆర్ఎస్‌ప్రభుత్వం సాగు అంటే తెలియని పట్టాదారు పాస్ బుక్ కలిగినవారందరికీ అప్పన్నంగా పెట్టుబడి సాయం ఖాతాలో జమ చేసింది. అయితే ఇకనుంచి ప్రజల సొమ్ము వృథా కాకుండా పంట సాగుచేసే వారికే భరోసా సాయం అందించాలని నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. అవసరమైతే ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఎకరానికి రూ.15 వేలు పంపిణీ చేస్తే పార్టీకి, ప్రభుత్వానికి తిరుగు ఉండదని, స్థానిక ఎన్నికల్లో విజయం సాధించవచ్చనే అంశం ఇటీవల జరిగిన మంత్రి వర్గం సమావేశంలో చర్చకు వచ్చినట్టు సమాచారం. 10 ఎకరాలకుపైగా భూమి ఉన్నవారికి పెట్టుబడి సాయం అందిస్తే ఎలాంటి ఉపయోగం లేదని, పేద, మధ్యతరగతి రైతులకు వేస్తే అన్ని రకాలుగా ప్రయోజనం ఉంటుందని డిస్కస్ చేసినట్టు టాక్ వినిపిస్తోంది. అదే విధంగా కౌలు రైతులను ఆదుకునేందుకు చట్టం తీసుకొచ్చి, వారికి భరోసా ఇచ్చే అంశంపై పరిశీలనచేయాలని ఒకరిద్దరు మంత్రులు ముఖ్యమంత్రి ముందు ప్రపోజల్ పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది.



శాటిలైట్ సర్వేనే కీలకం

ఇటీవల వ్యవసాయ విశ్వవిద్యాలయం శాటిలైట్ చిత్రాల ఆధారంగా ప్రతి గ్రామంలో సర్వే నెంబర్ వారీగా పంట విస్తీర్ణం లెక్కించేందుకు స్విట్జర్లాండ్ దేశానికి చెందిన సార్ మ్యాప్ సంస్థతో ఒప్పందం చేసుకుని, రాష్ట్రవ్యాప్తంగా పంటల సాగు వివరాలను సేకరించింది. 95 శాతం ఎలాంటి పంటలు వేశారో గుర్తించింది. శాటిలైట్ సర్వే చేసిన వివరాలను పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాకు ఐదు గ్రామాలను ఎంపికచేసి ఏఈవోలతో సర్వే చేయించగా ఒకే విధంగా వచ్చింది. దీంతో ఇకనుంచి శాటిలైట్ సర్వే ఆధారంగానే పెట్టుబడి సాయం అందించనుంది. ఈ సర్వే ద్వారా ప్రకృతి విపత్తులకు నష్టపోయిన రైతులను గుర్తించి పరిహారం అందజేయవచ్చు. సాగు చేసిన భూముల ఆధారంగా విత్తనాలు, ఎరువులు ఎంత కావాలో ముందుస్తుగా సిద్ధం చేసుకునే వీలుంటుంది. ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకం పంట సాగు చేసిన రైతులకే అందుతుందని ప్రభుత్వం బలంగా భావిస్తోంది.

# ఇందిరమ్మ రాజ్యం వచ్చింది.. ఇంటింటా సంక్షోభం తెచ్చింది

మొదటి పేజీ తరువాయి



వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో సోమవారం భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. రాష్ట్రంలో ఏ పల్లెకు పోయినా ఒకటే ఆవేదన ఆక్రందన కనిపిస్తోందన్నారు. పదేండ్ల తెలంగాణ రెండున్నర ఏండ్లలో సంక్షోభంలోకి జారుకున్నదన్నారు. కాంగ్రెస్ ని నమ్మి ఓటేస్తే అన్ని వర్గాలను అడ్డగోలుగా మోసం చేస్తున్నదన్నారు. కాంగ్రెస్ పార్టీ వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రానికి ఏం లబ్ధి జరిగింది, ఎన్ని కొత్త పథకాలు వచ్చాయని ప్రశ్నించారు.

ూశ్రీంశీ =ముుంం - టాస్క్ ద్వారా ఉచిత శిక్షణ..జిల్లా కలెక్టర్ ప్రకటన

ఒకవైపు ఎరువుల కొరత, విత్తనాల కొరత, కరెంటు కోతలు, కొత్తగా రైతు డిస్కం పేరుతో ఉచిత విద్యుత్తు కుట్రలు, రైతుబంధు ఎగవేత, రైతుబీమా రద్దు ఇలా దుర్మార్గంగా సర్కార్ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఆనాడు రైతుబంధు మేమెందుకు ఎగగొడతామని, ఇప్పుడు ఎగగొట్టే కుట్రలు చేస్తున్నారని సీరియస్ అయ్యారు. వచ్చే ఐదేళ్లు చిట్టి నాయుడుకి, ఆయన బృందానికి సినిమా చూపెట్టే బాధ్యత నాదంటూ వ్యాఖ్యానించారు. మా కార్యకర్తలను ఇబ్బందులు పెట్టిన ఒక్కొక్కడిని రిటైర్ అయినా, పారిపోయినా, సప్త సముద్రాలు దాటినా లాక్కొచ్చి నిలబెడతానని హెచ్చరించారు. తెలంగాణలో ఇవాళ ఎవరిని కదిలించినా ఒకటే మాట..మళ్లీ కేసీఆరే రావాలి అంటున్నట్లు స్పష్టం చేశారు కేటీఆర్. కాగా ఈ సమావేశంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంతో పాటు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి సంబంధించిన అంశాల పైన కూడా పార్టీ కార్యకర్తలకు కేటీఆర్ ఒక ప్రజంటేషన్ ద్వారా వివరాలు అందజేశారు.

# 'ఏడు జన్మలెత్తినా ఏం చేయలేవు'.. డిప్యూటీ సీఎం పవన్‌పై మాజీమంత్రి అంబటి ఫైర్

మొదటి పేజీ తరువాయి



"రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ఇలా మాట్లాడొచ్చా? మీ ఎమ్మెల్యే పంతం నానాజీ భాష ఎలా ఉందో చూశారా? అసలు ఎవరు గూండాలు? పవన్ గారూ.. మీరు ఏడు జన్మలెత్తినా మమ్మల్ని ఏమీ చేయలేరు. మీ ఉడత ఊపులకు, సొల్లు కబుర్లకు ఇక్కడెవరూ భయపడరు" అని స్పష్టం చేశారు. "నేను హోంమంత్రిగా లేకపోవడం మీ అదృష్టం" అని పవన్ అనడం ద్వారా ప్రస్తుతం ఉన్న హోంమంత్రి సరిగ్గా పని చేయడం లేదని ఆయనే ఒప్పుకున్నట్లయిందని అంబటి ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్‌కు హోంమంత్రి పదవి ఇవ్వాలని తాను సీఎం చంద్రబాబును రిక్వెస్ట్ చేస్తున్నానని పేర్కొన్నారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోకూడదని, ముంబై దాడుల నిందితుడు కసబ్‌ను కూడా చట్టప్రకారమే శిక్షించారని గుర్తు చేశారు. సాయికృష్ణ కేసులో ఒక అధికారి విచారణ జరుపుతుండగా హఠాత్తుగా 'సిట్' వేయడం వెనుక ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ప్రజల నుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేకనే ఈ నాటకాలు ఆడుతున్నారని, ఈ కేసులో వాస్తవాలు బయటకు రావాలంటే సీబీఐ లేదా ఎన్ఐఏ చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కోనసీమలో కాపు నేతల సమావేశంపై పవన్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని, గతంలో కులాల గురించి పవన్ మాట్లాడినట్లుగా ఈ రాష్ట్రంలో ఎవరూ మాట్లాడి ఉండరని అంబటి రాంబాబు దుయ్యబట్టారు. ఒకవైపు సాయికృష్ణ ఇంటికి జనసేన నేతలను పంపుతూ.. మరోవైపు ఈ కేసులో నిందితుడైన సీఐ నాగరాజును అరెస్ట్ చేయవద్దని ఆందోళనలు చేయించడం పవన్ దుర్మార్గపు రాజకీయాలకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నీట్ రీ ఎగ్జామ్‌లో మళ్లీ దగా

## బీహార్‌లో 'సాల్వర్ గ్యాంగ్' గుట్టురట్టు..

## 9 మంది నకిలీ అభ్యర్థులతో సహా 30 మంది అరెస్ట్



**న్యూస్ డెస్క్, 22 జూన్ (తెలుగు గళం):** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ యూజీ వైద్య విద్యా ప్రవేశ పరీక్షల వివాదాలు సమిసిపోయి.. మళ్లీ పరీక్ష నిర్వహించింది ఎన్టీఏ. అయితే దురదృష్టవశాత్తు ఈ రీ ఎగ్జామ్‌లోనూ అక్రమార్కులు తమ పంథా మార్చుకోలేదు. బీహార్‌లోని లఖిసరాయ్ జిల్లాలో పరీక్షా కేంద్రాల వద్ద నిర్వహించిన పకడ్బందీ తనిఖీల్లో భారీ కుంభకోణం వెలుగుచూసింది. అసలైన విద్యార్థులకు బదులుగా పరీక్షలు రాసేందుకు రంగంలోకి దిగిన 'సాల్వర్ గ్యాంగ్' (నకిలీ అభ్యర్థుల ముఠా) నెట్‌వర్క్‌ను జిల్లా యంత్రాంగం, పోలీసులు సంయుక్తంగా ఛేదించారు. వివిధ పరీక్షా కేంద్రాల్లో బయోమెట్రిక్, ఐడెంటిటీ వెరిఫికేషన్ సమయంలో దొరికిపోయిన 9 మంది నకిలీ అభ్యర్థులు సహా ఈ మోసంతో సంబంధం ఉన్న మొత్తం 30 మందిని అధికారులు శనివారం అరెస్ట్ చేశారు.

లఖిసరాయ్ జిల్లాలోని వేర్వేరు పరీక్షా కేంద్రాల్లో పక్కా సమాచారంతో అధికారులు ఏకకాలంలో ఈ తనిఖీలు చేపట్టారు. పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం.. కేఆర్కే హైస్కూల్ పరీక్షా కేంద్రం నుంచి ఒకరు, కేంద్రీయ విద్యాలయ కేంద్రం నుంచి అత్యధికంగా ఏడుగురు, అలాగే హసన్‌పూర్ స్కూల్ పరీక్షా కేంద్రం నుంచి మరొక నకిలీ అభ్యర్థిని అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అరెస్ట్ అయిన ఈ తొమ్మిది మంది నిందితులు బీహార్‌లోని విభిన్న జిల్లాలకు చెందిన వారని, అసలు అభ్యర్థుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు తీసుకుని, వారి స్థానంలో పరీక్ష రాయడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం.

కేవలం పరీక్ష రాస్తున్న వారినే కాకుండా, కేంద్రాల వెలుపల ఉంటూ వారికి సాంకేతిక సాయం అందిస్తున్న, అలాగే అభ్యర్థులను చేరవేస్తున్న ముఠా సభ్యులపై కూడా పోలీసులు ఉక్కుపాదం మోపారు. మాల్‌ప్రాక్టీస్, పరీక్షా మోసాలకు సహకరించిన మొత్తం 21 మందిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వీరిని అదుపులోకి తీసుకోగా.. ఈ ముఠా వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు ఆధారాలు లభించాయి. ప్రస్తుతం లఖిసరాయ్ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ప్రభాకర్ కుమార్, సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ శివం కుమార్‌ల ప్రత్యక్ష పర్యవేక్షణలో నిందితులను రహస్య ప్రాంతంలో విచారిస్తున్నారు. "నీట్ పునఃపరీక్షలో అక్రమాలకు పాల్పడుతూ 30 మంది దొరికిపోయారు. అందులో 9 మంది ఒకరి బదులు మరొకరు ఎగ్జామ్ రాస్తుండగా.. 21 మంది వీరికి వ్యూహాత్మకంగా సహకరించినట్లు తేలింది" అని ఎస్డీపీఓ శివం కుమార్ ధృవీకరించారు.

విచారణలో నిందితులు వెల్లడించిన వివరాల ఆధారంగా లఖిసరాయ్ జిల్లా వ్యాప్తంగా, పొరుగు జిల్లాల్లోనూ ప్రత్యేక పోలీసు బృందాలు విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నాయి. ఈ ఆపరేషన్‌ను జిల్లా కలెక్టర్ శైలేంద్ర కుమార్, ఎస్పీ ప్రేరణా కుమార్‌లు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. 24 గంటలూ కష్టపడి చదివే విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న ఈ ముఠా వెనుక కొంతమంది కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు, విద్యాశాఖ అధికారుల హస్తం కూడా ఉండవచ్చని ఉన్నతాధికారులు అనుమానిస్తున్నారు. దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని, పూర్తి నెట్‌వర్క్ వివరాలను త్వరలోనే మీడియాకు అధికారికంగా వెల్లడిస్తామని యంత్రాంగం పేర్కొంది.

# టీ కాంగ్రెస్‌లో కీలక పరిణామం.. పటాన్‌చెరు నుంచి బరిలో జగ్గారెడ్డి?

మొదటి పేజీ తరువాయి




ఇదే విషయమై జగ్గారెడ్డి ఇటీవలే కాంగ్రెస్ పార్టీ అధిష్ఠాన పెద్దల వద్ద తన మనసులోని మాటను సైతం బయటపెట్టినట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

సంగారెడ్డి బరిలో జగ్గారెడ్డి సతీమణి:

1986లో మున్సిపల్ కౌన్సిలర్‌గా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన జగ్గారెడ్డి.. 2004, 2009, 2018లో సంగారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2023లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో కానీ జగ్గారెడ్డి సంగారెడ్డి నియోజకవర్గం విషయంలో తన మనసు మార్చుకున్నారు. సంగారెడ్డిలో తాను ఎమ్మెల్యేగా జీవితంలో పోటీ చేయనని ఈ ఏడాది ప్రారంభంలో శపథం చేశారు. నాలుగు రోజుల క్రితం ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో సంగారెడ్డి నుంచి నేను కాదు నా సతీమణి నిర్మలా జగ్గారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉంటారని ఇందులో ఎలాంటి సందేహం లేదని మరోసారి కుండబద్దలు కొట్టారు. నిర్మల ప్రస్తుతం తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో ఆమె జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కూడా సేవలందించారు. అయితే తన సతీమణిని సంగారెడ్డి నుంచి బరిలోకి దింపి తాను పటాన్ చెరుపై దృష్టి సారించే వ్యూహంతో జగ్గారెడ్డి పావులు కదుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

పటాన్‌చెరులో ముడుముక్కలాట:

జగ్గారెడ్డి పోటీపై ప్రచారం ఇలా జరుగుతుంటే పటాన్‌చెరు రాజకీయంలో ఇప్పటికే మూడుముక్కలాట హైవోల్టేజ్ క్రియేట్ చేస్తోంది. ఇక్కడ హ్యాట్రిక్ విక్టరీతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఉండగా, కాంగ్రెస్ పార్టీలో కాటా శ్రీనివాస్ గౌడ్, నీలం మధు ముదిరాజ్ ఇద్దరు బలమైన ఆశావహులుగా ఉన్నారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరినా కాటా శ్రీనివాస్ వర్గంతో పొసగకపోవడంతో ఆయన తిరిగి బీఆర్ఎస్‌కు వెళ్లిపోయారనే టాక్ ఉంది. ఈ క్రమంలో ప్రచారం జరుగుతున్నట్లుగా జగ్గారెడ్డి పటాన్‌చెరు నియోజకవర్గంపై నిజంగానే దృష్టి సారించారా? రాబోయే రోజుల్లో జగ్గారెడ్డి వ్యూహం, సమీకరణాలు ఎలాంటి మలుపులు తిరుగబోతున్నాయి అనేది తెలంగాణ కాంగ్రెస్‌లో ఉత్కంఠ రేపుతోంది.

# ఘోర రోడ్డు ప్రమాదం.. డిటీఓ పైకి దూసుకెళ్లిన బొగ్గు టిప్పర్.!

మొదటి పేజీ తరువాయి




ఈ సమయంలో వేగంగా వచ్చిన బొగ్గు టిప్పర్ అదుపుతప్పి అధికారుల వైపు దూసుకెళ్లింది. టిప్పర్ బలంగా ఢీకొనడంతో వెంకన్న అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద తీవ్రతకు ఆయన మృతదేహం నుజ్జునుజ్జయ్యిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

ఈ ఘటనతో అక్కడ ఒక్కసారిగా విషాద వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. కాగా, వెంకన్న కేవలం 15 రోజుల క్రితమే బదిలీపై భూపాలపల్లి జిల్లాకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. విధి నిర్వహణలో ఉండగానే ఆయన మృతి చెందడం జిల్లా అధికార వర్గాలను, రవాణా శాఖ సిబ్బందిని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపడుతున్నారు.

# తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన.. 6 రోజుల పాటు దంచికొట్టనున్న వానలు!

**న్యూస్ డెస్క్, 22 జూన్ (తెలుగు గళం):** నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో రానున్న ఆరు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉత్తర ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ వరకు విస్తరించిన ద్రోణి, రాయలసీమ పరిసరాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం కారణంగా జూన్ 27 వరకు పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడనున్నాయని తెలిపింది. తెలంగాణలో మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మహబూబాబాద్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మరోవైపు ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, కరీంనగర్, పెద్దపల్లి తదితర జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని అధికారులు సూచించారు.

అటు ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. పిడుగుపాట్లు సంభవించే ప్రమాదం ఉన్నందున వర్షాల సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, భారీ హోర్డింగ్స్ సమీపంలో ఉండవద్దని ప్రజలకు హెచ్చరికలు జారీ చేసింది. నైరుతి రుతుపవనాల విస్తరణతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాకాలం ప్రారంభమైనట్లు కనిపిస్తోందని, రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు తగ్గి ప్రజలకు ఉపశమనం లభించే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు.

# ఇంద్రకీలాద్రిపై ఘోరం.. వారం వ్యవధిలో ఆలయంలో రెండు భారీ స్కామ్‌లు!



**న్యూస్ డెస్క్, 22 జూన్ (తెలుగు గళం):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ ఆలయంలో టికెట్ల గోల్‌మాల్ కలకలం రేపుతోంది. అమ్మవారి ఆదాయానికి గండి కొడుతూ, భక్తులను మోసం చేస్తున్న అక్రమార్కుల గుట్టు ఒక్కొక్కటిగా రట్టవుతోంది. కేవలం వారం రోజుల వ్యవధిలోనే ఇలాంటి రెండు పెద్ద ఘటనలు వెలుగుచూడటంతో ఆలయ ఈవో శీనా నాయక్ సీరియస్ అయ్యారు. ఈవో ఫిర్యాదు మేరకు స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో రెండు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.

తాజాగా నిన్న ఆలయంలో టికెట్ల పంచింగ్ దగ్గర పెద్ద మోసం వెలుగుచూసింది. రూ. 100 టికెట్లు కొనుగోలు చేసిన భక్తులు దర్శనానికి వెళ్లే సమయంలో వాటిని పంచింగ్ చేయాల్సి ఉంటుంది. అయితే, అక్కడ విధుల్లో ఉన్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగి చింతాడ సాయి, మరో మహిళా ఉద్యోగి కలిసి సుమారు 70 నుంచి 80 టికెట్లను పంచింగ్ చేయకుండా దాచిపెట్టారు. ఈ టికెట్లను మళ్లీ అమ్ముకుని సొమ్ము చేసుకోవాలనేది వీరి ప్లాన్. దీనిని గమనించిన ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు వెంటనే అలర్ట్ అయి, ఆ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తనిఖీ చేయగా పంచింగ్ చేయని టికెట్లు బయటపడ్డాయి. వెంటనే ఈ సమాచారాన్ని ఈవోకు చేరవేయగా.. టెంపుల్ పోలీస్ సిబ్బంది నరసింహారావు, జగదీష్‌లు నిందితులను పట్టుకుని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన ఈవో శీనా నాయక్ ఆ ఇద్దరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇలాగే ఈ నెల 14వ తేదీన కూడా ఆలయంలో అనధికార దర్శనాలు చేయిస్తున్న దళారీ గుట్టు రట్టయింది. గతంలో దుర్గమ్మ ఆలయంలో హోంగార్డ్‌గా పనిచేసిన చంద్రశేఖర్ అనే వ్యక్తి.. దళారీగా మారి భక్తులను నిలువునా ముంచాడు. ఏకంగా 50 మంది భక్తుల దగ్గర తలా రూ. 500 చొప్పున మొత్తం రూ. 25,000 వసూలు చేసి అక్రమంగా దర్శనాలు చేయిస్తుండగా ఈవో శీనా నాయక్ స్వయంగా రంగంలోకి దిగి అతడిని పట్టుకున్నారు. ఈవో ఫిర్యాదుతో స్పందించిన సీపీ రాజశేఖర్ బాబు.. హోంగార్డ్ చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. గతంలో కూడా అమ్మవారి ఆలయంలో నకిలీ రూ. 500 టికెట్ల వ్యవహారం తీవ్ర సంచలనం సృష్టించింది. అయితే అప్పట్లో నిందితులపై అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకుని వదిలేశారని, ఆ ఉదాసీనత వల్లే ఇప్పుడు సిబ్బంది, దళారీలు యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారని భక్తులు, స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా నిందితులపై కఠిన చర్యలు తీసుకుని ఆలయ పవిత్రతను కాపాడాలని వారు కోరుతున్నారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్‌ది సుతిలేని సంసారం ఎంపీ రఘునందర్ రావు హాట్ సెటైర్లు

**న్యూస్ డెస్క్, 22 జూన్ (తెలుగు గళం):** తాను చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి  కేంద్ర ప్రభత్వాన్ని బద్నాం చేసేందుకు కంకణం కట్టుకున్నాడని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు  ఆరోపించారు. ఇవాళ ఆయన నగరంలో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో మెట్రో ఫేజ్-1 టేకోవర్‌లో భారీగా అవకతవకలు జరగాయని.. వాటిపై విచారణ జరిపి ఎక్కడ తనపై కేసులు పేడతారేమోనని సీఎం రేవంత్ రెడ్డి ఇలాంటి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రానికి ఐఆర్ఎఫ్సి రుణం పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పూచీకత్తుతోనే వచ్చిందని అన్నారు. అలాంటప్పుడు మెట్రో ఫేజ్-2 పనులకు కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటుందని ఆయన సూటిగా తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన.. సుతి లేసి సంసారంలా ఉందని ఫైర్ అయ్యారు. మంత్రులు, ముఖ్యమంత్రి మాటలను అసలు వినడం లేదని అందుకే రేవంత్ రెడ్డి తీవ్ర ఫ్రస్టేషన్‌లో ఉన్నారని రఘునందర్ రావు అన్నారు.

# కమలాపురంలో ఇందిరమ్మ ఇండ్ల జాతర

## పండుగ వాతావరణంలో కోలాహాలంగా గృహప్రవేశాలు

**తెలుగు గళం న్యూస్ ములకలపల్లి జూన్ 22**

ములకలపల్లి మండలం కమలాపురం గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులు సోమవారం ఒకేరోజు సామూహికంగా గృహప్రవేశ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణను ప్రత్యేకంగా ఆహ్వానించి, ఆయన చేతుల మీదుగా గృహప్రవేశాలు నిర్వహించుకున్నారు. ఎమ్మెల్యే గ్రామానికి చేరుకున్న సందర్భంగా గ్రామస్తులు డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, డీజే ఊరేగింపులతో ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టి ఆహ్వానించగా, ప్రజలు పూల వర్షం కురిపిస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. గ్రామమంతా పండుగ వాతావరణాన్ని తలపిస్తూ ఉత్సాహభరితంగా కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ, పేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు కేవలం గోడలు, పైకప్పు మాత్రమే కాదని, పేద కుటుంబాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుని గృహప్రవేశం చేసిన కుటుంబాలు ప్రభుత్వం, ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే జారె ఆదినారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు. తమకు సొంత ఇంటి కల నెరవేరడం జీవితంలో మరపురాని సందర్భంగా భావిస్తున్నామని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





# డీటీవో వెంకన్న పార్థివదేహానికి నివాళులర్పించిన కడియం కావ్య



**హనుమకొండ, జూన్ 22 (తెలుగు గళం న్యూస్)**

భూపాలపల్లి జిల్లా రవాణా శాఖ అధికారి వెంకన్న విధి నిర్వహణలో ఉండగా లారీ ఢీకొని మృతి చెందిన ఘటనపై ప్రజాప్రతినిధులు, అధికారులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వరంగల్ లోక్‌సభ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య హనుమకొండలోని వెంకన్న నివాసానికి చేరుకుని ఆయన పార్థివదేహానికి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, బీసీ సంక్షేమ మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, వరంగల్ పశ్చిమ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తదితరులతో కలిసి వెంకన్న పార్థివదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకన్న కుటుంబ సభ్యులను పరామర్శించిన నాయకులు, ఈ విషాద ఘటన పట్ల తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి ప్రభుత్వం, పార్టీ పరంగా అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వెంకన్న మృతి పట్ల అధికార వర్గాలు, ప్రజాప్రతినిధులు, స్థానికులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు.

# భూపాలపల్లి జిల్లాలో ఘోర విషాదం

## విధి నిర్వహణలో డీటీఓ వెంకన్న దుర్మరణం



**తెలుగు గళం న్యూస్, భూపాలపల్లి, జూన్ 22**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సోమవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీఓ) వెంకన్న (46) విధి నిర్వహణలోనే ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో బొగ్గు లోడ్‌తో వచ్చిన లారీ అదుపు తప్పి ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఘనపూర్ మండలం చెల్పూర్ శివారులోని ఆర్టీఓ కార్యాలయం ఎదుట ఉదయం సుమారు 9.30 గంటలకు డీటీఓ వెంకన్న తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన ఓ హార్వెస్టర్ వాహనాన్ని సీజ్ చేసి కార్యాలయం లోపలికి పంపిస్తున్న సమయంలో తాడిచర్ల ఓపెన్ కాస్ట్ గని నుంచి కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు బొగ్గు తీసుకెళ్తున్న లారీ వేగంగా వచ్చి ముందుగా హార్వెస్టర్‌ను ఢీకొట్టింది.



అనంతరం అదుపు తప్పిన లారీ పక్కనే నిలబడి ఉన్న వెంకన్నపైకి దూసుకెళ్లడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనపై స్పందించిన ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. లారీలో సాంకేతిక లోపమా లేదా డ్రైవర్ నిర్లక్ష్యమా అనే కోణాల్లో విచారణ జరుగుతోందన్నారు. ఈ ఘటనపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కలెక్టర్ రాహుల్ శర్మతో ఫోన్‌లో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన అధికారిని కోల్పోవడం శాఖకు తీరని లోటని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రమాదం అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎమ్మెల్యే గండ్ర



సత్యనారాయణరావు, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆసుపత్రికి చేరుకుని వెంకన్న పార్థివ దేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లాకు చెందిన వెంకన్న 2012లో ఏఎంవీఐగా రవాణా శాఖలో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. ఇటీవలే జగిత్యాల జిల్లా నుంచి భూపాలపల్లికి బదిలీపై వచ్చారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో నిర్వహించిన అధికారిక సంతాప సభలో కలెక్టర్, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు వెంకన్న చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాల మౌనం పాటించి నివాళులర్పించారు. రాష్ట్ర రవాణా శాఖ ఉన్నతాధికారులు కూడా భూపాలపల్లికి చేరుకుని పార్థివ దేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. విధి నిర్వహణలోనే ప్రాణాలు కోల్పోయిన డీటీఓ వెంకన్న మృతి జిల్లా వ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

# నెహ్రూ విగ్రహాన్ని యథాస్థానంలోనే కొనసాగించాలని వినతి

## కార్యదర్శి, తహసీల్దార్‌కు నెహ్రూ కాలనీ వాసుల వినతిపత్రం

**ధర్మసాగర్, జూన్ 22 (తెలుగు గళం):**





ధర్మసాగర్ గ్రామంలోని నెహ్రూ కాలనీ వాసులు తమ కాలనీలో ఉన్న నెహ్రూ విగ్రహాన్ని యథా స్థానంలోనే కొనసాగించాలని కోరుతూ గ్రామ కార్యదర్శి, తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ సుమారు 50 సంవత్సరాలుగా తమ కాలనీలో నెహ్రూ విగ్రహం ఉందని, ఆ విగ్రహం కారణంగానే ఈ ప్రాంతానికి నెహ్రూ కాలనీ అనే పేరు వచ్చిందని తెలిపారు. దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహం తమ కాలనీకి ప్రత్యేక గుర్తింపుగా నిలిచిందని పేర్కొన్నారు. ఇటీవల విగ్రహం వెనుక భాగంలో ఉన్న స్థలాన్ని కొనుగోలు చేసి నూతనంగా ఇల్లు నిర్మించిన అనంతరం, కాలనీ ప్రజల అభిప్రాయం తీసుకోకుండా విగ్రహాన్ని అక్కడి నుంచి తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. విగ్రహం తరలిస్తే కాలనీ ప్రజల మనోభావాలు దెబ్బతింటాయని, అలాగే కాలనీ అభివృద్ధి పనుల్లో భాగంగా డ్రైనేజీ నిర్మాణానికి అడ్డుగా ఉందనే కారణంతో విగ్రహాన్ని మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నెహ్రూ కాలనీకి గుర్తింపుగా ఉన్న విగ్రహాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగించకుండా ప్రస్తుతం ఉన్న స్థలంలోనే కొనసాగించాలని కాలనీ వాసులు కోరారు. ఈ విషయంపై గ్రామ కార్యదర్శితో పాటు తహసీల్దార్‌కు కూడా వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు.

# సత్తుపల్లిలో ఘోరం..

## వ్యభిచార గృహం వద్ద వివాదం

## గ్రామ పెద్దలపై కత్తితో దాడి





**సత్తుపల్లి, జూన్ 22 (తెలుగుగళం)**

సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామ శివారులో ఆదివారం అర్ధరాత్రి తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. గ్రామ సమీపంలో నడుస్తున్నట్లు ఆరోపణలు ఉన్న వ్యభిచార గృహం విషయంలో జరిగిన వివాదం ఇద్దరు గ్రామ పెద్దలపై కత్తి దాడికి దారితీసింది. పోలీసుల వివరాల ప్రకారం, కిష్టారం ఎస్సీ కాలనీకి చెందిన గ్రామ పెద్దలు మారోజు నాగేశ్వరరావు, నక్క వెంకటేశ్వరరావు గ్రామ సమీపంలో వ్యభిచార గృహం నిర్వహిస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న నాగమణి, హనుమంతరావు దంపతులను కలిసి, ఆ కార్యకలాపాలను నిలిపివేసి అక్కడి నుంచి వెళ్లిపోవాలని హెచ్చరించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చెలరేగి ఘర్షణకు దారితీసింది. ఆవేశానికి లోనైన నాగమణి, హనుమంతరావు దంపతులు కొబ్బరి బొండాలు నరికే కత్తితో గ్రామ పెద్దలపై దాడి చేసినట్లు సమాచారం. ఈ ఘటనలో మారోజు నాగేశ్వరరావు, నక్క వెంకటేశ్వరరావుకు తీవ్ర గాయాలు కాగా, 108 అంబులెన్స్ సిబ్బంది వారిని వెంటనే సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఘటన అనంతరం నాగమణి, హనుమంతరావు పరారీలోకి వెళ్లగా, ఈ వ్యవహారానికి సంబంధించి కొత్తగూడెంకు చెందిన సోని అనే మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసిన వి.ఎం. బంజర్ పోలీసులు పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# డీసీసీ కార్యవర్గ ప్రమాణస్వీకారంలో ఎమ్మెల్యే నాగరాజు

**తెలుగు గళం న్యూస్ హనుమకొండ /జూన్ 22**




హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ కడియం కావ్య, డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి పాల్గొని కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాలని, పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వంపై ఎమ్మెల్యే విమర్శలు

అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని దారి దోపిడీ ప్రభుత్వంగా అభివర్ణించారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్లే రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని, అయినా కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఆపకుండా ప్రజల కోసం పనిచేస్తుందన్నారు. వర్ధన్నపేటలో జరుగుతున్న అభివృద్ధిని జీర్ణించుకోలేక ప్రతిపక్ష నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, అభివృద్ధిపై చర్చకు రావాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో జరిగిన దోపిడీని ప్రజలు గమనించారని, ప్రతిపక్ష నేతలు నోరు అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు. బీజేపీ నేతలు రాష్ట్రానికి చేసింది లేదని, ప్రాజెక్టులను అడ్డుకుంటున్నారని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో చైర్మన్లు, జిల్లా, నియోజకవర్గ, మండల ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు, యువజన, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా

# బత్తిని ఎల్లగౌడ్ నియామకం



**ధర్మసాగర్, (తెలుగు గళం)జూన్ 22:**

హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యదర్శిగా ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బత్తిని ఎల్లగౌడ్ నియమితులయ్యారు. సోమవారం హనుమకొండ డీసీసీ భవన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా అంకితభావంతో పనిచేస్తూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి విశేష కృషి చేసిన ఎల్లగౌడ్‌కు ఈ పదవి దక్కడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఆయనకు ఈ బాధ్యతలు రావడం గర్వకారణమని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బత్తిని ఎల్లగౌడ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి జిల్లా కార్యదర్శి పదవి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేస్తానని అన్నారు. ఎల్లగౌడ్ నియామకంతో నారాయణగిరి గ్రామం, ధర్మసాగర్ మండల కాంగ్రెస్ కార్యకర్తల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

# మూడ విశ్వాసాల దుశ్చర్యాలను ఖండించిన సిపిఐ ఎం


## -- జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, ఎంబీ నరసారెడ్డి

**భద్రాచలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలుగు గళం న్యూస్**

రెండు నెలల వ్యవధి లోనే ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందితే సానుభూతి చూపించాల్సింది పోయి మృతదేహాలను ఇంటికి తీసుకురావద్దు అంటూ హుకుం జారీ చేసి ఇంటి ప్రధాన గేటు కి తాళం వేసిన యజమాని వైఖరిపై సిపిఐఎం తీవ్రంగా మండిపడింది. సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎమ్ బి నర్సారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు, పట్టణ కమిటీ సభ్యులు నకిరేకంటి నాగరాజు స్థానిక ప్రజల ద్వారా ఇంటి యజమానితో చరవాణిలో మాట్లాడి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అప్పటికి సదురు యజమాని వినకపోవడంతో తనపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎం బి నర్సారెడ్డి మాట్లాడుతూ సైన్స్ ఎంతో పురోగతి చెందుతున్న ఈ రోజుల్లో మృతదేహాల సెంటిమెంట్ పేరుతో ఇంట్లోకి రానివక పోవడం దుర్మార్గమని ఇటువంటి ఘటనలు ఇటీవల పెరిగిపోవటం ఆందోళన కలిగిస్తుందని జీవించి ఉన్నప్పుడు ఒకే కుటుంబ సభ్యులాగా కలిసి ఉండే ఇంటి యజమాని దుర దుష్టశాత్తు అద్దెకు ఉన్నవారు మరణిస్తే మైల పేరుతో దూరం పెట్టడం మానవ సంబంధాలకే ప్రమాదమని అన్నారు.



దూడల సాయి ప్రకాష్ కుటుంబానికి సిపిఎం ఎప్పుడు అండగా ఉంటుందని అవసరమైతే వారి మృతదేహాలను ప్రజల సందర్శనార్థం సిపిఐఎం కార్యాలయంలో ఉంచడానికి ఎటువంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు.



మూడ విశ్వాసాల పై సెమినార్స్, సదస్సు లాంటి కార్యక్రమాలు అవగాహన నిమిత్తం ప్రజలకు కలిగించాలని అన్నారు. 15 రోజుల్లోనే తండ్రి ఉద్యోగం పొంద కుండా దూడల సాయి ప్రకాష్ కుటుంబం రోడ్డు ప్రమాదంలో మృతి చెందటం అత్యంత బాధాకరమని ఆ కుటుంబానికి సిపిఐ ఎం ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తుందని అన్నారు

# విమానాశ్రయంలో తూటాల కలకలం.. ప్రయాణికుడి అరెస్టు

**శంషాబాద్, తెలుగు గళం:**



ఓ దేశీయ ప్రయాణికుడు తూటాలతో విమానం ఎక్కడానికి యత్నించిన సంఘటన శంషాబాద్ విమానాశ్రయంలో సోమవారం చోటు చేసుకుంది. ఎయిర్‌పోర్ట్ అధికారుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం మధురవాడకు చెందిన కె.మధుబాబు వ్యక్తిగత పనుల కోసం హైదరాబాద్‌కు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో తన బ్యాగులో రెండు లైవ్ బుల్లెట్లు పెట్టుకొని ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం ఎక్కడానికి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వచ్చాడు. తనిఖీలు చేయగా తూటాలు దొరికాయి. వాటికి సంబంధించి ధ్రువపత్రాలు అతని వద్ద లేకపోవడంతో అరెస్టు చేశారు. ఆర్జీఐఏ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# విధి నిర్వహణలోనే ఆర్టీవో(డి టి ఓ ) ఎమ్.వెంకన్న మృతి బాధాకరం

## -- ఎంవీఐ సంగం వెంకట పుల్లయ్య




భద్రాచలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలుగు గళం న్యూస్

భూపాలపల్లి జిల్లా రోడ్డు రవాణా శాఖ అధికారి (డిటివో) ఎమ్.వెంకన్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల భద్రాచలం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, అసోసియేషన్ ఆఫ్ ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ టెక్నికల్ ఆఫీసర్స్ తెలంగాణ ఉపాధ్యక్షులు సంగం వెంకట పుల్లయ్య సోమవారం ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకన్న చిత్రపటానికి నివాళులర్పించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ భూపాలపల్లి ఆర్టీవో కార్యాలయం ఎదుట బొగ్గు లారీలను తనిఖీ చేస్తున్న సమయంలో అతివేగంగా వచ్చిన టిప్పర్ లారీ వెంకన్నపై నుంచి దూసుకెళ్లడంతో ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకుందని తెలిపారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేస్తున్న సమయంలోనే ఆయన ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని అన్నారు.

బదిలీపై భూపాలపల్లికి వచ్చి నెల రోజులే కావడంతో పాటు విధి నిర్వహణలో ఉండగానే మృతి చెందడం మరింత బాధాకరమని పేర్కొన్నారు. వెంకన్న కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి కుటుంబానికి ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, కానిస్టేబుల్ శివయ్య, సిబ్బంది నాగేశ్వరరావు, భీముడు పాల్గొన్నారు

# మద్యం దందా జరుగుతున్న పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు



## కిరాణా షాపుల్లో మద్యం దందా హద్దు అదుపు లేదు

దుమ్ముగూడెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలుగు గళం న్యూస్

ఏజెన్సీ ప్రాంతమైన పర్ణశాల నుండి పైడిగూడెం వరకు మద్యం దందా జరుగుతున్న పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు, జిల్లా కలెక్టర్, పి ఓ ఐటీడీఏ భద్రాచలం

భద్రాచలం ఎక్సైజ్ అధికారులకు కంప్లైంట్ చేసినప్పటికీ అధికారులు సకాలంలో స్పందించకపోవడం వల్ల విచ్చలవిడిగా కిరాణా షాపుల్లో మద్యం దందా హద్దు అదుపు లేకుండా నడుస్తుంది ఇదంతా అధికారులకు అనుసంధానంలోనే నడుస్తుందని అనుమానం వస్తుంది దుమ్ముగూడెం మండలంలో మూడు లైసెన్స్ షాపులు ఉన్నప్పటికీ ఒకటి మాత్రమే షాపు వద్దకు వచ్చిన వాళ్లకు ఇస్తుంటారు మిగతా రెండు షాపులు ఆటో మీద వ్యాన్లు మీద తరలించి కిరాణా షాపుల్లో వేస్తుంటారు ఇదే కాకుండా పక్క రాష్ట్రమైన సతీష్ గడ్ సిజి వర్ష రాష్ట్రాలకు కారుల మీద టూ వీలర్ మీద ఆటో మీద రవాణా చేస్తుంటారు కానీ ప్రభుత్వ నిబంధనలు అలా లేవు లైసెన్సున్న షాపు వద్దకు వచ్చిన కస్టమర్కు ఇవ్వాలంటే ఒక పరిమితి ఉంటుంది పరిమితికి మించి ఇస్తున్నారు అంటే అది ప్రభుత్వ నిబంధనలకి విరుద్ధంగా జరుగుతున్నట్టు ఇంత పెద్ద మొత్తంలో దందా జరుగుతుంటే ఉన్నతాధికారులు చూసి చూడనట్టుగా ఉండటం ఆశ్చర్యంగా ఉంది ఇది సరైంది కాదు ఏజెన్సీ ప్రాంతంలో కొన్నిచోట్ల గిరిజన చట్టాలకు విరుద్ధంగా బినామీలు పేర్లతో పాట పాడేది అమాయక గిరిజనుల సర్టిఫికెట్లతో పాట పాడి గిరిజన ఇతరులు ఈ అక్రమ దందాలకు పాల్పడుతున్నారు పర్మిషన్ లేని వైన్స్ బెల్ట్ షాపులను రద్దుచేసి ఈ అక్రమ దందాలను అరికట్టాలని సిపిఐ ఎంఎల్ ప్రజాపంద మాస్ లైన్ డిమాండ్ చేస్తుంది.

ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు సాయన్న డివిజన్ నాయకులు శివ ప్రశాంతు మండల నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# రెండుళ్లు గా పోరాడి జీతాలు పెంచుకున్న 183 మంది మున్సిపల్ రిక్షా కార్మికులు



## 9 వేలు నుండి 15 వేలు పెంపుదల

## ఆప్కోస్ లో మరణించిన వారి కుటుంబాలు రేపటినుండి విధులు కు హాజరు

## కార్మికులకు అండగా ఉంటాము - సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమండ్రి,(తెలుగు గళం) జూన్ 22: రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్య విభాగం లో 183 మంది రిక్షా కార్మికులు చాలా సంవత్సరాలుగా కేవలం 9 వేలుకే పనిచేస్తున్నారని ఈ సమస్యపై గత రెండు సంవత్సరాలుగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటిపాక మధు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు పలుమార్లు కార్మికులు సమ్మె, ధర్నాలు నిర్వహించారు వారం క్రితం పవన్ కళ్యాణ్ ఎదుట పెద్దఎత్తున నిరసనలు చేపట్టారు. శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట వందలాది మంది కదం తొక్కారు

సోమవారం ఉదయం స్థానిక ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఇంటి వద్ద కలిసి కార్మికుల గోడు వినిపించారు.ఆయన వెంటనే మున్సిపల్ కార్యాలయం వద్దకు వచ్చి కమిషనర్ తో గంటపాటు చర్చించారు అనంతరం యూనియన్ నాయకులు కమిషనర్ తో మాట్లాడారు దీనితో సాయత్రం ఎమ్మెల్యే వాసు ఇంటి వద్ద ఎం హెచ్ ఓ సమక్షం లో సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమ కోసం పని చేస్తుందని అన్నారు.కార్మికుల సమస్యలపై మధు, ఎం హెచ్ ఓ లు నిరంతరం నాతో మాట్లాడుతూనే ఉన్నారని తెలిపారు.నేను ఎమ్మెల్యే అవ్వగానే సిబ్బంది కొరత తీర్చాలని దీనికోసం జిల్లా కలెక్టర్ పలుమార్లు చర్చించి నిర్ణయాలు తీసుకున్న తర్వాత కార్మికులు న్యాయం చేస్తున్నానని మీకు ఎప్పుడు అండగా ఉంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.అంతే కాకుండా ఇప్పుడు పెంచిన జీతాలు క్రమక్రమంగా పెరుగుతూ ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

# డీటీఓ వెంకన్న దుర్మరణం పై మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ రాహుల్ శర్మ తీవ్ర దిగ్భ్రాంతి

## ప్రభుత్వ పరంగా పూర్తి అండగా ఉంటామని హామీ





తెలుగు గళం న్యూస్, భూపాలపల్లి, జూన్ 22

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీఓ) వెంకన్న మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది.ఘనపురం మండలం చెల్పూర్ శివారులోని ఆర్టీఓ కార్యాలయం వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అతివేగంగా వచ్చిన బొగ్గు లారీ ఢీకొనడంతో వెంకన్న అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.ఈ ఘటనపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో ఫోన్లో మాట్లాడి ప్రమాదానికి సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వెంకన్న కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.ప్రమాదం జరిగిన వెంటనే జిల్లా ప్రధాన ఆసుపత్రికి చేరుకున్న కలెక్టర్ రాహుల్ శర్మ, వెంకన్న పార్థివ దేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇటీవలే భూపాలపల్లి జిల్లాకు బదిలీపై వచ్చిన వెంకన్న తన అంకితభావం, కర్తవ్యనిర్వహణతో మంచి అధికారిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు.వెంకన్న భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడిని ఆదుకునేందుకు ప్రభుత్వం తరపున అందాల్సిన అన్ని ప్రయోజనాలు త్వరితగతిన అందజేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సంతాప సభలో అధికారులు వెంకన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి రెండు నిమిషాల మౌనం పాటించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డీఆర్వో వసంత కుమారి, ఆర్డీఓ హరికృష్ణ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్తో పాటు వివిధ శాఖల అధికారులు, రవాణా శాఖ సిబ్బంది పాల్గొని వెంకన్నకు కన్నీటి నివాళులర్పించారు.రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించిన అధికారి, విధి నిర్వహణలోనే రోడ్డు ప్రమాదానికి బలికావడం జిల్లా ప్రజలను తీవ్ర విషాదంలో ముంచెత్తింది.



# తండ్రి చితికి నిప్పు పెట్టిన కూతుళ్లు

కే.జగన్నాదాపురం (తెలుగు గళం) జూన్ 22 :కోనసీమ జిల్లా లో హృదయ విదారక సంఘటన చోటు చోటుచేసుకుంది. అయినవిల్లి మండలం కె .జగన్నాథపురం గ్రామానికి చెందిన పిచ్చిక సత్యనారాయణ పక్షవాతంతో బాధ పడుతున్నారు. అతని భార్య మానసిక దివ్యాంగురాలు. అనుకోకుండా వారిపై విధి కూడా పగ పట్టినట్టు సత్యనారాయణ గుండె పోటుతో మరణించారు. వీరికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. ఒక పక్కన మతిస్థిమితం లేని తల్లి, మరోపక్క ఏం చేయాలో తెలియని అమాయక ఆడపిల్లలు. చేసేది ఏం లేక తండ్రికి తామే కొడుకులు అనుకోని సత్యనారాయణ అంత్యక్రియలు చేశారు.. ఈ వార్త సోషల్ మీడియా లో తెగ వైరల్ అవ్వడం తో జిల్లా రవాణా అధికారి వారి కుటుంబాన్నీ పరామర్శించి వారి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇవ్వడమే కాకుండా ఈ విషయాన్ని స్వయంగా కలెక్టర్ మహేష్ కుమార్ దృష్టికీ తీసుకెళ్లారు. వెంటనే కలెక్టర్ చలించి పోయారు. మానసిక వికలాంగురాలు అయినా తల్లికీ వైద్యం అందిచడంతోపాటు వారి చదువులకు, కుటుంబ అవసరాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ఆ ఊరి ప్రజలే కాదు చుట్టూ పక్కన ఉన్న గ్రామస్తులు కూడా అంత్యక్రియలకు హాజరు అయ్యారు.. అందరి మనస్సులు దుఃఖంతో నిండి పోయాయి.

# రేషనలైజేషన్ పేరుతో పాఠశాలల మూసివేతను నిలిపివేయాలి: ఏబీవీపీ



నల్లగొండ (తెలుగు గళం): రేషనలైజేషన్ పేరిట రాష్ట్రములో 23 వేల పాఠశాలను మూసి వేయడం వల్ల విద్యార్థులు విద్యకు దూరమయ్యే అవకాశం ఉందని ఎబివిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఛత్రపతి చౌహాన్, ఆవేదన వ్యక్తం చేశారు... రాష్ట్ర ప్రభుత్వం విద్యా విధానాలను నిరసిస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నల్గొండ శాఖ ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించారు.. ఈ సందర్భంగా విద్యార్థులు, ఎబివిపి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి డీఈఓ కార్యాలయం ముందు బైఠాయించి ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు.. రాష్ట్ర ప్రభుత్వం

ప్రభుత్వ పాఠశాలల మూసివేయడం పేదలను విద్యకు దూరం చేసే ప్రయత్నం చేస్తుందని అన్నారు.. ప్రైవేటు పాఠశాలల ఫీజు దోపిడీని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఆరోపించారు.. విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వ పాఠశాలల మూసివేసే కుట్ర ను తక్షణ ఉపసంహరించుకొని, పాఠశాల లలో మౌలిక సదుపాయాలు కల్పించాలినీ ఖాళీగా ఉన్న ఎంఈఓ డీఈవో పోస్టులను టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టల్ వెంటనే భర్తీ చేయాలనీ డిమాండ్ చేశారు ...

# మూడు దశాబ్దాలుగా కండలేరు ముంపు గ్రామస్థులు నిరసన




నెల్లూరు జిల్లా నెల్లూరు(తెలుగు గళం):– నెల్లూరు జిల్లాలోని కండలేరు ముంపు గ్రామం అయిన వండ్లూరు గ్రామస్తులు 32 సంవత్సరాలుగా బీసీ ఎస్సీ ఎస్టీలకు పునరావవాసం కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం చెందింది అని,ముంపు వాసుల హక్కుల గురించి రాష్ట్ర రాజధానిలో తేల్చుకుంటాం అని భారతీయ జనతా పార్టీ నేత మిడతల రమేష్ కండలేరు ముంపు గ్రామం అయిన వండ్లురు గ్రామస్తులు కలెక్టర్ కార్యాలయంలో చేసిన నిరసనలో పాల్గొని పేర్కొన్నారు.కండలేరు ముంపు గ్రామానికి పునరావాసం కల్పించడడం బాధ్యతగా రెవెన్యూ యంత్రాంగం పునరావాస కేంద్రం ఇప్పటివరకు ఏర్పాటు చేయకపోవడం క్షమించరాని నేరం అని అదే గ్రామంలో ఉన్న వాళ్లకు అగ్రవర్ణాలకు 60 అంకణాల ప్లాట్లు కేటాయించారు.కండలేరు డ్యామ్ లో చేపల వేట ఆధారంగా జీవిస్తున్న గిరిజనులు దళితులు బీసీల హక్కులు కాలరాస్తూ రెవెన్యూ అధికారులు నిరంకుశంగా వ్యవహరిస్తున్నారు.

వండ్లూరు గ్రామానికి వెంటనే పునరావాసం కల్పించె చర్యలు చేపట్టకపోతే రాష్ట్ర రాజధాని లో అధికారుల వద్ద ముంపు వాసుల హక్కులు తేల్చుకుంటామని రమేష్ తెలిపారు.

# నల్లగొండ లో కలకలం

## ఒకే ఇంట్లో నలుగురి మరణం

## హత్యా, ఆత్మహత్యా అనే కోణంలో పోలీసుల విచారణ



నల్లగొండ (తెలుగు గళం): నల్లగొండ జిల్లా కేంద్రంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు అనుమానస్పద స్థితిలో మృతి చెందారు.. స్థానిక తెలంగాణ కాలనీలో నివాసం ఉంటున్న మహమ్మద్ సుల్తాన్, ఆయన భార్య హసీనా తో పాటు సహా మరో ఇద్దరి మృతదేహాలు వారి ఇంట్లోనే పోలీసులు గుర్తించారు.. మృతదేహాలు కుళ్లిపోయిన స్థితిలో ఉండటంతో నాలుగు రోజుల క్రితమే వారు మరణించి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు... ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో లోపలికి వెళ్లి చూడగా విషయం వెలుగులోకి వచ్చింది.. మృతుడు మహ్మద్ సుల్తాన్ స్థానికంగా బ్యాగుల వ్యాపారి వద్ద పనిచేస్తుండగా, మృతురాలు హసీనా ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నట్లు సమాచారం... ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.. మృతులది హత్యా, లేక ఆత్మహత్యనా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది..

# ప్రేమించు కున్నాం.. పెళ్లి చేసు కున్నాం.. మాకు ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి ఎస్పీ సార్..




తెలుగు గళం న్యూస్ కడపజిల్లా జూన్ 22:కడపజిల్లా బ్రహ్మంగారిమఠం.. ఇద్దరూ ఐదు సంవత్సరాల క్రితం ప్రేమించుకున్నారు. వీరి వివాహానికి పెద్దలు కూడా అంగీకరించారు. వీరిద్దరి సంతోషం ఎక్కువ రోజులు నిలవలేదు. అబ్బాయి బైక్ యాక్సిడెంట్ లో రెండు కాళ్లు పోగొట్టుకున్నాడు. అక్కడి నుంచి వీళ్ళ జీవితంలో కష్టాలు మొదలయ్యాయి. అమ్మాయి ప్రేమించిన వ్యక్తికి కాళ్లు పోయినప్పటికీ తననే పెళ్లి చేసుకుంటానని ఇంట్లో చెప్పగానే ఇంట్లో వాళ్ళు ఒప్పుకోకపోవడంతో పెద్దలను ఎదిరించి ప్రేమించిన ఆ వ్యక్తినే పెళ్లి చేసుకుంది. పెద్దల నుంచి ప్రాణహాని ఉందని పోలీసులనుఆశ్రయించడంతో పోలీసులు వాళ్లను కొంతకాలం దూరంగా ఉండండి పరిస్థితులు సర్దుకుంటాయని చెప్పడంతో వేరే రాష్ట్రానికి వెళ్లి మేము సంతోషంగా జీవిస్తుంటే మా బంధువులు మమ్మల్ని ఇప్పటికి వేధిస్తున్నారు. మా సొంతూరికి రాకోకుండా మమ్మల్ని అక్రమ కేసులతో వేధిస్తున్నారని, ఈరోజు కడప జిల్లా ఎస్పీ నచ్కేత్ విశ్వనాథ్ ను కలసి మాకు ప్రాణహాని ఉందని, కంప్లైంట్ ఇచ్చామని మీడియా సపోర్టు కూడా కావాలని ప్రెస్ క్లబ్ కి వచ్చి మాకు మా బంధువుల నుంచి ప్రాణహాని ఉందని, కడప జిల్లా ఎస్పీ ని కలిశామని బాధితులు వాపోయారు..


Printed and Published by BARISHETTI SRIKANTH on be half Of Telugu galam
H.No: H.NO: 8-2-293/82/BJR/127, BJR NAGAR, FILM NAGAR, GREATER HYDERABAD(M.CORP), PO:JUBILEE HILLS, HYDERABAD, TELANGANA - 500033.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.